రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 19, వంకాయ 45, బెండ 55, పచ్చిమిర్చి 45, కాకర 55, బీర 50, క్యాబేజీ 16, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 35, దొండ 57-60, చిక్కుడు 23-70, గోకర 50, బీట్‌రూట్ 28, క్యాప్సికం 70, ఆలు 23, దోస 28, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 48. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ఘనంగా శ్రమదాన్ దివస్

రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్ ఫేవికాల్ ఛాంపియన్ క్లబ్ అధ్యక్షుడు చెల్లోజు ఎల్లాచారి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శ్రమదాన్ దివస్ పేరిట ఫేవికాల్ ఛాంపియన్ క్లబ్ సభ్యులు స్కూల్‌లోని విరిగిపోయిన బెంచీలు, కుర్చీలు, కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, శ్రీకాంత్‌చారి, అనిల్‌చారి, సుధాకర్‌చారి, ఫిరోజ్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

యేసు బోధనలు ఆచరణీయం

రామంతాపూర్: అరోరా(అటానమస్) పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ సంబరాల్లో విద్యార్థులు యేసుక్రీస్తు జననం నాటికను ప్రదర్శించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. క్రిస్మస్ పండగ సహనం, మానవత్వం ప్రాముఖ్యతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ సీహెచ్ సతీష్ కుమార్, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

రాత్రి వేళ హడలెత్తిస్తున్న లోడ్ లారీలు!

అధిక బరువు నింపుకొని మితిమీరిన వేగంతో ప్రయాణం

- డ్రైవర్ల నిర్లక్ష్యంతో ప్రమాదాలు
- బెంబేలెత్తుతున్న జనం
- పట్టించుకోని ఆర్టీఏ అధికారులు




నాగోలు రేడియల్ రోడ్డులో రాత్రి వేళ అధిక లోడ్‌తో వస్తున్న లారీలు

నాగోలు: భారీ లోడ్‌తో వస్తున్న లారీలు, టిప్పర్లు రాత్రి సమయంలో బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎల్‌బీనగర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతం నుంచి రాత్రి 11 గంటల తర్వాత భారీలోడ్‌తో 10 టైర్ల లారీలు, టిప్పర్లు రోడ్డు మీదకు వస్తున్నాయి. లారీ ఓనర్లు, డ్రైవర్లు ఎలాంటి అనుమతులు లేకుండా లారీ క్యాబిన్ వరకు ఇసుక, ఇటుక, కాంక్రీట్ సిమెంట్, మార్బుల్స్, గ్రానైట్స్ వంటివి నింపుకొని వస్తూ అర్ధరాత్రి వేళ హంగామా సృష్టిస్తున్నారు.

- ఇతర రాష్ట్రాల నుంచి లారీ డ్రైవర్లను తీసుకువచ్చి వారికి ట్రిప్పుల లెక్కన డబ్బులు ఇవ్వడంతో వారు అధిక లోడు, ఓవర్ స్పీడ్‌తో లారీలను నడుపుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకుకెళ్తే లారీలకు ఛలాన్లు విధించి వదిలేస్తున్నారు. నాగోలు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న రేడియల్ రోడ్డుపై ప్రతి రోజూ లారీల వల్ల ఏదో ఒక ప్రమాదం జరుగుతోంది.
- హయత్‌నగర్ పరిధిలోని తట్టిఅన్నారం, గౌరెల్లి, కుంట్లూరు, పెద్ద అంబర్‌పేట, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాలలో క్రషర్ మి షన్లు, రెడీ మిక్స్ కాంక్రీట్ కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో అక్కడ నుంచి నాగోలు రేడియల్ రోడ్డు ద్వారా నగరంలో తీసుకువస్తున్నారు.
- ట్రిప్పులు ఎక్కువ వేస్తే అధిక మొత్తం వస్తుందన్న ఆశతో డ్రైవర్లు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ ముందు వెళ్లే వాహనాలను ఓవర్ టేక్ చేసుకుంటూ వెళ్తున్నారు. దీంతో రాత్రి 10.30 గంటల తర్వాత నాగోలు, బండ్లగూడ, ఆనంద్ నగర్, మన్సూరాబాద్, ఎల్‌బీనగర్ ప్రాంతాల వైపు వెళ్లాలంటే స్థానిక కాలనీ వాసులు భయాందోళన గురవుతున్నారు.
- రెడీమిక్స్ కాంక్రీట్ లారీలో ఎక్కువ లోడ్ నింపుకొని రోడ్డుపై వేగంగా వెళ్తుండటంతో అందులోని సిమెంట్, కంకర రోడ్డుపై పడి ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
- అలాగే, అపార్టుమెంట్ల నిర్మాణం కోసం సెల్లార్ గుంతలు తవ్వే సమయంలో బయట పడే పెద్ద పెద్ద రాళ్లను రాత్రి సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా టిప్పర్లలో తరలిస్తుండటం వల్ల కూడా ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోని ఆర్టీఏ అధికారులు..

వాహన తనిఖీలు చేయాల్సిన ఆర్టీఏ అధికారులు సాయంత్రం తమ విధులు ముగించుకుని వెళ్తున్నారు. దీంతో రాత్రి సమయంలో లారీ డ్రైవర్లు ఎలాంటి నిబంధనలు పాటించకుండా అధిక లోడ్‌తో ఇసుక, కంకర, డస్ట్, రెడీమిక్స్ కాంక్రీట్ నగరంలోకి తరలిస్తున్నారు. లారీలు అధిక లోడ్‌తో రావడంతో రోడ్డుపై ఉన్న డ్రైనేజీ మూతలు, మంచినీటి పైప్‌లైన్లు తరచూ పగలి పోతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీఏ అధికారులు స్పందించి రాత్రి సమయంలో నిబంధనలు విరుద్ధంగా అధిక లోడ్‌తో వస్తున్న లారీపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా నగరంలోకి..

నిబంధనల ప్రకారం జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి లోడ్‌తో వచ్చే లారీలు, కంటైనర్లను పగటిపూట నగర శివారు ప్రాంతం నిలిపివేయాలి. వాటిలోని సరుకును అక్కడి నుంచి చిన్న లారీలు, ఇతర వాహనాల్లో నగరంలోకి తరలించాలి. అయితే, డ్రైవర్లు పగటి పూట లారీలోని సరుకును అన్‌లోడ్ చేయకుండా రాత్రి వరకూ వేచి చూస్తున్నారు. రాత్రి 10 గంటలు కాగానే.. అధిక లోడ్‌తో మితిమీరిన వేగంతో నగరంలోకి వస్తూ యాక్సిడెంట్స్ చేస్తున్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళాకు విశేష స్పందన



మేళాలో కొనుగోలుదారుల సందడి

వనస్థలిపురం: చేనేత వస్త్రాలు, ఉత్పత్తులను ఆదరించాల్సిన అవసరం ఉందని, తద్వారా ఎంతో మందికి ఉపాధి దొరుకుతుందని ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా నిర్వాహకుడు అక్బర్ అలీ అన్నారు. వనస్థలిపురం లోని హుడా కమ్యూనిటీ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నదని తెలిపారు. మేళాలో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లినెన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్‌షీట్స్, కొండపల్లి బొమ్మలు, గాజులు, బ్యాగులు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయన్నారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని ఆయన చెప్పారు.

శృంగేరి శంకరమఠంలో ప్రత్యేక పూజలు



గురు దత్తాత్రేయ జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న కేవీ శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్ అల్కాపురిలోని శృంగేరి శంకరమఠంలో నిర్వహిస్తున్న గురు దత్తాత్రేయ జయంతి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి వారి పాదుకులకు సహస్రనామార్చన, సామూహిక నవమ సప్తాహ గురుచరిత్ర పారాయణం చేశారు. దత్తాత్రేయ స్వామి చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా శృంగేరి శంకరమఠం బ్రాంచ్ హెడ్ కేవీ శ్రీనివాస్ మాట్లాడుతూ, పిలిస్తే పలికే దైవం దత్తాత్రేయ స్వామి అని, ఒక్కసారి స్వామివారి పారాయణం చేస్తే సకల సంపదలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహకులు వీఆర్ గౌరీ శంకర్, విశ్వనాథ శోభనాద్రి, సూర్యనారాయణరావు, గౌరీ భాస్కర్, ముదికొండ శంకర శర్మ, సూరి వ్యాస్‌కుమార్, నరసింహమూర్తి, సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ చెరువు నీటి నియంత్రణకు చర్యలు



సరూర్‌నగర్ చెరువు కట్ట వద్ద టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: వర్షాకాలంలో సరూర్‌నగర్ చెరువు నీటి వల్ల లోతట్టు కాలనీలు ముంపునకు గురైతున్నాయని, చెరువులోకి వస్తున్న వరదనీటి నియంత్రణ చర్యల్లో భాగంగా 3వ టన్నెల్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ చెరువు వద్ద జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సరూర్‌నగర్ ప్రాంతంలో ముంపు తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ప్రియదర్శిని పార్కు మసీదు వద్ద గతంలో ఉన్న మూడు గేట్లు ఉన్నాయని, భారీ వర్షాలు పడి చెరువు నీరు బయటకు వచ్చి కాలనీలు ముంచెత్తకుండా టన్నెల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాలుగు నెలలుగా ఈ పనులు నిలిచిపోయాయని, అంచనాకన్నా ఎక్కువ వ్యయం అవుతుండటంతో కాంట్రాక్టర్‌తో మాట్లాడి మరిన్ని నిధులు మంజూరు చేస్తామన్నారు. ఈ పనులు పూర్తయితే కోదండరాంనగర్, వీవీనగర్, కమలానగర్, న్యూ గడ్డిఅన్నారం, పీ అండ్ టీ కాలనీలకు ముంపు సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్ విక్కీ, ప్రదీప్, సుధీర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పహాడీషరీఫ్: ఎర్రకుంట అభివృద్ధిలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారం మరువలేనిదని జల్‌పల్లి మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ దిల్రుసా హసన్ షా అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంటలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్, సీసీ రోడ్డు పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. నాయకులు హుస్సేన్, దయానీ, ఇబ్రహీం, నూర్, హమీద్ పాల్గొన్నారు.

వీరసావర్కర్ విగ్రహం వద్ద గ్రీల్స్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: కాచిగూడ చౌరస్తాలోని వీర సావర్కర్ విగ్రహం వద్ద కాంపౌండ్ వాల్, గ్రీల్స్ ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ బుధవారం జీహెచ్ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వీరసావర్కర్ విగ్రహం చుట్టు ప్రస్తుతం ఉన్న కాంపౌండ్ వాల్, గ్రీల్స్ శిథిలావస్థకు చేరుకుందని, దీంతో పాదచారులు, వాహనదారులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె పేర్కొన్నారు. కాచిగూడ డివిజన్‌కు నూతనంగా జీహెచ్ఎంసీ ఏఈని నియమించాలని కోరారు.

గ్రాఫిక్ డిజైనింగ్ కోర్సులో మహిళలకు ఉచిత శిక్షణ

నల్లకుంట: శ్రీ సత్యసాయి సేవా సంస్థలు హైదరాబాద్ ఆధ్వర్యంలో నల్లకుంట శివంలో ఉచిత 'గ్రాఫిక్ డిజైన్'లో శిక్షణ తరగతులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 30న ప్రారంభం కానున్న తరగతులకు 28 ఏళ్ల లోపు వయస్సు కలిగి పట్టభద్రులై, కంప్యూటర్ నాలెడ్జి ఉన్న మహిళలు అర్హులని శ్రీ సత్యసాయి సేవా సంస్థల హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎ.మల్లేశ్వర్‌రావు తెలిపారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మొదటి బ్యాచ్, 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెండో బ్యాచ్‌లో శిక్షణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడ అందుబాటులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్ ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు నల్లకుంట శివం రోడ్డులోని శివం మందిరం ప్రాంగణంలోని కార్యాలయం తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్స్: 90106 32555, 98484 87440లలో సంప్రదించాలని మల్లేశ్వరరావు సూచించారు.

సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని వినతి



డీసీ అరుణకుమారికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేత పున్న గణేష్‌నేత

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ డివిజన్ విజయపురి కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ కోరారు. ఈ మేరకు ఆయన కాలనీవాసులతో కలిసి సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రామకృష్ణా పురం డివిజన్ టెలిఫోన్ కాలనీ నుంచి వచ్చే వరద నీరు విజయపురి కాలనీలో రోడ్ నంబర్ 1లో నిలుస్తుండటంతో లెవల్ చూసి సీసీ రోడ్డు వేసేందుకు ఐదు నెలల క్రితం కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి అలాగే వదిలేశాడన్నారు. దీంతో కంక తేలి అస్తవ్యస్తంగా తయారైన ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందు స్థానికులతో పాటు ఇతర కాలనీల వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని గణేశ్ తెలిపారు. తమ వినతికి స్పందించిన సరూర్ నగర్ డీఈ అరుణకుమారి వెంటనే కాంట్రాక్టర్‌తో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారన్నారు. పనులు చేపట్టేందుకు ప్రసుత్త కాంట్రాక్టర్ ముందుకు రాకపోతే వేరే కాంట్రాక్టర్‌కు పనిని అప్పగించాలని చెప్పారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్ రావు, శివ, దుర్గా ప్రసాద్, మణికంఠ, రవి తేజ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణాల పరిశీలన



బాలాపూర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదార్లను కోరారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు.

మహిళలను దుర్భాషలాడిన వ్యక్తికి జైలు

విజయనగర్‌కాలనీ: మహిళను దుర్భాషలాడిన వ్యక్తికి మూడ్రోజుల జైలుశిక్ష పడిన ఘటన బుధవారం ఆసీఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సై.మహ్మద్ జాహేద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసీఫ్‌నగర్ రవీంద్రనగర్‌లో నివసించే ఎం.గణేష్ దగ్గర అదే ప్రాంతంలో నివసించే నర్సింహ గత అక్టోబర్ నెలలో అవసరం నిమిత్తం రూ. లక్ష అప్పుగా తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో ఈనెల 18న నర్సింహ ఇంటికి వెళ్లి దాడి చేయడంతో పాటు అతడి భార్య అమృతను దుర్భాషలాడాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. 4వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు న్యాయమూర్తి సత్యనారాయణ నిందితుడికి మూడ్రోజుల జైలుశిక్షను విధించారు.

రోడ్డు కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి: కొప్పుల



రోడ్డుపై కట్టిన గోడను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

లింగోజిగూడ: లింకు రోడ్డు కబ్జా చేసి గోడను నిర్మించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు.డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి కాలనీ, పవనగిరి కాలనీ, లక్ష్మీభవాని కాలనీలకు సంబంధించిన లింకు రోడ్డు కబ్జా చేసి అడ్డుగా గోడ నిర్మించారని కాలనీల ప్రజలు కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో బుధవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేని లే అవుట్లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కాలనీలలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ల నిర్మాణ సమయంలో అనుమతులకు ఒక లేఅవుట్ చూపించి ఓసీ వచ్చిన తర్వాత పూర్తిగా లే అవుట్ రూపురేఖలను మార్చేస్తున్నారని ఆరోపించారు.అక్రమదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు .కాలనీల వాసులు సత్యం, శ్రీనివాస్, హరినాథ్, నవీన్‌రావు, మహ్మద్ యాసిన్, కేథార్‌నాథ్, వెంకట్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

విద్యతోనే అణగారిన వర్గాలకు గుర్తింపు



సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లక్ష్మీ ప్రసన్నగౌడ్, గీతారెడ్డి, బ్రహ్మయ్య

నాగోలు: విద్య ద్వారానే అణగారిన వర్గాలకు సమాజంలో గుర్తింపు వస్తుందని చెప్పిన వ్యక్తి సంత్ గాడ్గే బాబా అని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ లక్ష్మీ ప్రసన్నగౌడ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి అన్నారు. స్వచ్ఛ భారత్ స్ఫూర్తి ప్రదాత సంత్ గాడ్గే బాబా 67 వర్ధంతిని బుధవారం నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీలో తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య, ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్మికులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గాడ్గే బాబా చేసిన సేవా కార్యక్రమాలు చిరస్మరణీయమని, యువత గాడ్గే బాబాను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. అంబేడ్కర్‌కు గురువుగా గాడ్గే బాబా అనేక సూచనలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దవూర బ్రహ్మయ్య, ఎంఆర్ రావు, పగడాల ఎల్లయ్య, నాగిళ్ల యాదగిరి, పగడాల ఉమాపతి, పగిళ్ల వెంకటేష్, పున్నం రాములు, జూపల్లి రామకృష్ణ, చెరుకు ఉమేష్ గౌడ్, సిద్దాల అరవింద్, టీపీసీసీ రాష్ట్ర ఆదివాసీ గిరిజన వైస్ చైర్మన్ కె.గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలలను దత్తత తీసుకోండి

కాచిగూడ: గోవుల రక్షణతోపాటు గోశాలలను దత్తత తీసుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని తెలంగాణ గోశాలల ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సమర్పన్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అంబర్‌పేట, పటేల్‌నగర్‌లోని గోశాలలో గోవులకు నెల రోజులకు సరిపడా కుట్టి (దాణా), మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. ప్రతి నెల ఒక గోశాలకు దాణా, మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేయడానికి లయన్స్ క్లబ్ సమర్పన్ ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని ఆయన అన్నారు. లయన్స్ క్లబ్ సమర్పన్ అధ్యక్షుడు మహేందర్ గుప్తా, కార్యదర్శి నిర్మల్ కుమార్ జైన్, కోశాధికారి ప్రేమ్‌చంద్ మునోద్, స్వతంత్రసమరయోధులు పండిత్ గంగారామ్ స్మారక్‌మంచ్ అధ్యక్షుడు భక్తరామ్, అనిల్ కౌశిక్, బానోత్ గణేష్, లకావత్ రమేష్ పాల్గొన్నారు.

అధికారుల ఆదేశాలు బేఖాతర్



పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో చెత్తను కాల్చివేస్తున్న దృశ్యం



కాలనీలో రోడ్డు పక్కనే చెత్తను తగులబెట్టిన దృశ్యం

- కాలనీల్లోనే చెత్త కాల్చివేత
- పారిశుద్ధ్య కార్మికుల నిర్వాకం

హస్తినాపురం: ఎల్‌బీ నగర్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్మికులు చెత్తను ఊడ్చి ఎత్తివేయకుండా ఎక్కడికక్కడే కాలనీల్లో, రోడ్ల పక్కనే కాల్చి వేస్తున్నారని పలు కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. చెత్తను ఎట్టి పరిస్థితుల్లో కాల్చవద్దని ఉన్నతాధికారులు చెప్తున్నా కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ఉన్నతాధికారుల ఆదేశాలను లెక్క చేయడం లేదని అంటున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దగ్గరుండి మరీ చెత్తకుప్పలను తగులబెట్టిస్తున్నారని, ఆ సమయంలో వస్తున్న పొగతో కళ్ల మంటలు వస్తున్నాయని, శ్వాస పీల్చలేకపోతున్నామని సమీపంలోని ఇళ్ల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం నాగార్జున సాగర్ రోడ్డు పక్కన ఉన్న పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో ప్రతిరోజూ చెత్తను తగుల బెడుతున్నారని, అదేమని అడిగితే ఇలాగే తగులబెడతాం అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కాలనీల్లో చెత్తను తగులబెట్టకుండా కిందిస్థాయి సిబ్బందికి తగిన ఆదేశాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కాచిగూడ: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్పించి చట్టబద్ధత కల్పించాలని దళిత క్రైస్తవుల ఎస్సీ రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు నాగళ్ల పోచయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే దళిత క్రైస్తవుల ఎస్సీ స్టేటస్ బిల్లు పెట్టించి, చట్టబద్ధత కల్పించాలని సీఎంకు బుధవారం వినతి పత్రం సమర్పించారు.

పేరు గొప్ప ఊరు దిబ్బ

- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- ఏడాదిన్నరగా పారుతున్న మురుగు
- కంపుకొడుతున్న కాలనీలు
- పట్టించుకోని పాలకవర్గం, అధికారులు



డ్రైనేజీని బయటకు పంపేందుకు ఏర్పాటు చేసిన మోటర్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రజలు వివిధ రకాల పన్నులు చెల్లిస్తున్నా.. మౌలిక సదపాయాలు సమకూరడం లేదు. కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. డ్రైనేజీ లైన్లు స్తంభించి మురుగు నీరు వీధుల గుండా ప్రవహిస్తోంది. దీంతో వీధులన్నీ మురికికూపాలుగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. పన్నుల వసూళ్లల్లో, ఆదాయంలో బడంగ్‌పేట కార్పొరేషన్ సిబ్బంది మంచిపేరు సంపాదించుకున్నారు. కానీ సమస్యల పరిష్కారంలో అట్టడుగున ఉన్నారనే విమర్శలు మూటకట్టుకుంటున్నారు. ఇక్కడి సిబ్బంది పాలకుల మెప్పు కోసం సమస్యలను గాలికొదిలేస్తున్నారని స్థానికులు అంటున్నారు. పాలకులు, అధికారులు కుమ్మక్కై సమస్యలు పరిష్కరించడంలో మీనవేశాలు లెక్కిస్తున్నారని బహటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం

కార్పొరేషన్ పరిధిలోని 32 డివిజన్‌లో డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. పరిష్కారం కోసం అధికారులు, కా ర్పొరేటర్ల దృష్టికి తెచ్చినా.. పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. 29వ డివిజన్ లోని రామిడి చంద్రారెడ్డి కాలనీలో ఏడాదిన్నరగా డ్రైనేజీ పొంగుతూ చెరువులు, కుంటలను తలపిస్తోంది. గాంధీనగర్, సబితాఇంద్రారెడ్డి నగర్, మె యిన్‌రోడ్డులోని పలు కాలనీల మురుగు లైన్లు రామిడి చంద్రారెడ్డి కాలనీ మీదుగా వెలుతున్నాయి. లీకేజీల వల్ల చంద్రారెడ్డి కాలనీలో మురుగు పొంగిపొర్లడం మొదలు పెట్టింది. అధికారులకు స్థానిక లు ఫిర్యాదు చేయడంతో 5హెచ్‌పీ మోటర్‌తో డ్రైనేజీని బయటకు పంపే ప్రయత్నం చేశారు. నీటిని బయటకు పంపేందుకు నాలాను ఓపెన్ చేశారు. దీంతో మరింత కంపు కోడుతోంది. నీటిని పక్క కాలనీల్లో వదులుతుండటంతో అక్కడి ప్రజలు కూ డా అవస్తపడుతున్నారు. మురుగుతో పాటు రోడ్డు ను మూసేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కరించకపోతే ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పాలకులు, అధికారులు కుమ్మక్కు



పాలకులు, అధికారులు ఒక్కటై ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేస్తున్నారు. ఏడాదిన్నరగా కాలనీలో డ్రైనేజీ పొంగుతున్నా పట్టించుకోవడం లేదు. సకాలంలో పరిష్కరించినప్పుడే అధికారులపై నమ్మకం ఏర్పడుతుంది.

– లాలా సందీప్, బడంగ్‌పేట